మినీ కథ

# ఏది స్వర్గం

జీవితమంతా తీరని కోరికల్తో బాధ పడి బాధపడి ఒక నిరుపేదవాడు, భూలోకంలో కన్నుమూసి పరలోకంలో ఒక విశాల సుందర మందిరంలోని ఒక హంసతూలికా తల్పం మీద కన్ను తెరిచాడు. దగ్గర్లో నిలబడిన సేవకుల్ని పిలిచి –

"ఆకలి" అన్నాడు.

"ఏం తెమ్మంటారు" సేవకుడు అడిగాడు!

భూలోకంలో తను తినాలనుకొన్నవి, తినలేకపోయినవి రకరకాల పదార్థాలు కోరుకొన్నాడు. సేవకుడు క్షణంలో అన్నీ తెచ్చి అమర్చాడు. పేదవాడు క్షణంలో నగంలో తినేసి సుష్టుగా తేన్చాడు. ఆతరవాత హాయిగా పడుకొని నిద్రపోయాడు. సేవకుడు తెచ్చిన షడ్రసోపేత భోజనం మళ్ళీ ఆరగించాడు.

హాయిగా మళ్ళీ తెల్లవారేదాకా నిద్రపోయాడు, భూలోకంలో ఎంత కష్టపడి పనిచేసినా కడుపునిండా తిండి ఎరుగని పేదవాడికి ఈ జీవితం చాలా బావుందనిపించింది. ఇలా కొన్నిరోజులు గడిచాయి. ఒక రోజున –

వాడికి అస్తమానం తినడం, పడుకోవడం, వొళ్ళు విరుచుకొని ఆవులించి మళ్ళీ తినడం, పడుకోవడం విసుగనిపించింది.

సేవకుణ్ణి పిలిచి –

"విసుగ్గావుంది ఏదన్నా పనిచెప్పు నేనుకూడా చేస్తాను." అన్నాడు.

"ఇక్కడ చేయడానికి పనిఏమి ఉందండి?" అన్నాడు సేవకుడు.

మానవుడికి కోపం వచ్చింది. "ఏడిసినట్టుంది! ఇలా ఎంతకాలమని ?" అని ప్రశ్నించాడు.

"కొన్ని యుగాలు గడవాలి"

"బాగానే వుంది వ్యవహారం! ఇంతకంటే నరకమే బావుండేట్టుంది, అక్కడికే పోతాను." అన్నాడు మానవుడు, "ఇప్పుడు తమరున్నది నరకంలోనే" అని సమాధానం ఇచ్చాడా సేవకుడు. ★

శ్రీమతి పోలవరపు కామేశ్వరి